సాక్షి
అనంతపురం
సోమవారం । 9 । అక్టోబర్ । 2023



సంతల ఆదాయం రూ.4.64 లక్షలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.4.64 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది.



టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.6°/22.7°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్– 14, 17 ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపికలు ఆదివారం స్థానిక ఎంఎస్‌కే అకాడమీలో జరిగాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సుగుణబాయి, జిల్లా కోఆర్డినేటర్ ఎల్.నాగరాజు పాల్గొన్నారు.

- **అండర్– 14 బాలికల విభాగం:** అంజన్న శ్రీ మనోజ్ఞ, ఎస్.నదియా తపస్సు, టి.భవ్య సాయి, బి.చరిత, జిది, టి.శరణి, భవ్యశ్రీ, జె.ప్రణవిరెడ్డి, ఆర్.ఉష, జి.సుప్రియ, కె.విజయలక్ష్మి ఎంపికయ్యారు.
- **అండర్– 14 బాలుర విభాగం:** స్నేహిత్ సింహ, బి.కార్తికేయ, బీఎండీ ముజంబీర్, గుణసాయి, ఎం.సెంథస్‌సాయి, వెంకటసాయి, బి.ఈశ్వర్, ఎస్.సంతోష్, సి.శరత్‌కుమార్, కె.యశ్వంత్, బీఎండీ ఆజాద్.

అండర్–17 బాలికల విభాగం: ఎం.చేతన, జి.సుస్మిత, కె.వర్షిత, జి.చందనశ్రీ, బి.సాయి గీతిక, పి.అమ్మాజాన్, నాగ వర్షిత, ఎ.కిరణ్మయి, టి.పుష్పలత, భానుబీ, ఎస్.తనూజ, బి.పావని.

అండర్ 17 బాలుర విభాగం..
చిన్మయి శ్రీవాస్తవ్, బి.వెంకట్, ఆర్.రామాంజనేయ నాయక్, సాయి రిషిక్, పి.నవనీత్, ప్రణవ్‌కుమార్, విక్టర్ బాబు, దేవేంద్ర నాయక్, ఆంజనేయ సూర్య, లోహిత్‌రెడ్డి, మోక్షిత్ శ్రీసాయి, మారుతి ఎంపికయ్యారు.

మెడికల్ మినిస్టీరియల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

అనంతపురం మెడికల్: జిల్లా మెడికల్ అండ్ హెల్త్ మినిస్టీరియల్ అసోసియేషన్ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆఫీస్ ఏఓ గిరిజా మనోహర్, కె.మనోహర్ అధ్యక్షతన ఆ అసోసియేషన్ నాయకులు సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా మక్బుల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ నాగేంద్ర, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టీ శ్రీనివాస్‌కుమార్, కోశాధికారిగా జె.దామోదర్, కార్యనిర్వహణ కార్యదర్శిగా సి.నాగరాజు ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా పి.మాధవీలత, ఎస్.షెక్షావలి, పి.శ్రీనివాసులు, రంగనాథ్, ఆర్ కమలాకర్‌రాజు, సహాయ కార్యదర్శులుగా జి.పవన్‌కుమార్, సి.శ్రీనివాసులు, దాదా అజిత్, ఎం.అశోక్‌కుమార్, ఎస్.రమాదేవిని ఎంపిక చేశారు.

విస్తృతంగా శాస్త్రీయ ప్రచారం

అనంతపురం కల్చరల్: జనవిజ్ఞాన వేదిక ద్వారా విస్తృతంగా శాస్త్రీయ ప్రచారం చేస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. ఆదివారం జేవీవీ కార్యాలయంలో వెంకటరామిరెడ్డి అధ్యక్షతన సంస్థ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథి గేయానంద్ మాట్లాడుతూ కళాయాత్రలు, సదస్సులు, మ్యాజిక్ షోలు, వర్క్ షాపుల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. జేవీవీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు భాస్కర్, కోశాధికారి జిలాన్ మాట్లాడారు.

అభివృద్ధి వికేంద్రీకరణ సమితి అధ్యక్షుడిగా కేవీ రమణ



నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్: అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర కమిటీలో మార్పులు, చేర్పులు చేసినట్లు ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు ఆలూరు రామిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక లలితకళాపరిషత్తులో అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి సమావేశం జరిగింది. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కేవీ రమణ, ఉపాధ్యక్షులుగా గాజుల వెంకటసుబ్బయ్య, జీ.నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజా హొన్నూరు, సహాయ కార్యదర్శులుగా రాజేశ్వరి, కృష్ణవేణి, కోశాధికారిగా కేపీ కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ కృష్ణాజలాలను పునఃపంపిణీ చేయాలని చేసిన తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, కృష్ణా రివర్ రెగ్యులేటరీ బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ఈనెల 12న నగరపాలక సంస్థ ముందు సంతకాల సేకరణ చేపట్టాలని తీర్మానించారు.

క్రీడా సంరంభం

మరో నెల రోజుల్లో క్రీడా సంరంభం ఆరంభం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీసి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో కనీవినీ ఎరుగని రీతిలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు సమాయత్తమైంది. ఇందుకు అవసరమైన క్రీడా పరికరాలను సచివాలయాలకు చేరుస్తోంది.

- నవంబర్ రెండో వారంలో 'ఆడుదాం ఆంధ్రా'
- 663 సచివాలయాల పరిధిలో క్రీడా పోటీల నిర్వహణ
- ప్రతి సచివాలయం పరిధిలో ప్రత్యేక క్రీడా స్థలం
- క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడలు



అనంతపురం: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. నవంబర్ రెండో వారంలో ప్రారంభమయ్యే ఈ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 663 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడలు నిర్వహించనున్నారు. దేశ చరిత్రలో ఇప్పటిదాకా ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో 20 వేల పోటీలు జరగనున్నాయి. 'ఆడుదాం ఆంధ్రా'లో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ ఖోఖో క్రీడలు నిర్వహిస్తారు. వీటికి అదనంగా 3కే మారథాన్, యోగా, టెన్నికాయిట్ ఈవెంట్లను కూడా నిర్వహిస్తారు.

విజేతలకు నగదు బహుమతులు..
క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.35వేలు, రూ.15వేలు, రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు అందిస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ తృతీయ విజేతలకు వరుసగా రూ. 5లక్షలు, రూ.3లక్షలు, రూ.2 లక్షలు అందజేయనున్నారు.

బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రముఖ క్రీడాకారులు
ప్రముఖ క్రీడాకారులు అంబటి రాయుడు, కరణం మల్లీశ్వరి, పీవీ సింధు, డి.హారిక, శ్రీకాంత్, వి.జ్యోతి సురేఖ వంటి వారిని 'ఆడుదాం ఆంధ్రా'కు బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రకటించి ఇందులో భాగస్వామ్యం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీయడానికి ఈ క్రీడా సంబరాలు దోహదపడేలా తీర్చిదిద్దనున్నారు. చక్కటి స్ఫూర్తిని నింపేలా ఆటల పోటీలు నిర్వహించనున్నారు. పోటీలకు వచ్చే క్రీడాకారులకు మంచి భోజనం సహా ఇతర సదుపాయాలు కల్పించనున్నారు.

సచివాలయాలకు క్రీడా పరికరాలు..



'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు సంబంధించి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడా పరికరాలను సచివాలయాలకు పంపించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటికి సంబంధించిన శాంపిల్స్‌ను కలెక్టర్ ఎం.గౌతమి ఇటీవల పరిశీలించారు. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే పూర్తి పరికరాలు రాగా, అనంతపురం జిల్లాకు రెండు రోజుల్లో పూర్తిస్థాయి పరికరాలు చేరనున్నాయి. వచ్చిన తక్షణమే ఆయా సచివాలయాలకు పంపుతారు.

జిల్లాకు కేటాయించిన క్రీడా పరికరాలు	
క్రీడా పరికరాల వివరాలు	పరికరాల సంఖ్య
బేసిక్ క్రికెట్ కిట్ (మెన్)	1,326
బేసిక్ క్రికెట్ కిట్ (ఉమెన్)	663
ప్రొఫెషనల్ క్రికెట్ కిట్ ఫర్ మెన్	263
ప్రొఫెషనల్ క్రికెట్ కిట్ ఫర్ ఉమెన్	123
క్రికెట్ లెదర్ బాల్స్	363
బ్యాడ్మింటన్ నైలాన్ నెట్	663
స్టేజ్-1 బ్యాడ్మింటన్ రాకెట్స్	3,978
స్టేజ్-2 బ్యాడ్మింటన్ రాకెట్స్	1,105
నైలాన్ షటిల్ కాక్	663
నైలాన్ షటిల్ కాక్	1,326
ఫెదర్ షటిల్‌కాక్	641
స్టేజ్-1 వాలీబాల్	1,989
స్టేజ్-2 వాలీబాల్	544
వాలీబాల్ నెట్	663
కబడ్డీ నీ క్యాప్స్	2,151
ఖోఖో యాంక్లెట్స్	2,151
టెన్నికాయిట్	1,326
ట్రోఫీలు	270
మెడల్స్	3,078
సర్టిఫికెట్స్	3,078

క్రీడాపోటీలకు కార్యాచరణ



ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడాపోటీల నిర్వహణ నవంబర్ రెండో వారం నుంచి నిర్వహిస్తున్నాం. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఆటస్థలాల పరిశీలన పూర్తయ్యింది. ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తగిన కార్యాచరణ రూపొందించాం.
– పి.నరసింహారెడ్డి, చీఫ్ కోచ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ

జెడ్పీలో రేపు 'దిశ' సమావేశం



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ భవన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు దిశ (జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) సమావేశం ప్రారంభమవుతుందని ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ తెలిపారు. కలెక్టర్/కమిటీ మెంబర్ సెక్రటరీ అయిన ఎం.గౌతమి ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం పార్లమెంట్ సభ్యుడు/కమిటీ చైర్మన్ తలారి రంగయ్య అధ్యక్షతన జరిగే సమావేశంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికానికి సంబంధించి (జూలై ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు) భౌతిక, ఆర్థిక పురోగతిపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

11 అంశాలపై ప్రధాన చర్చ..
గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు, జీజేఎం/తాగునీటి సరఫరా, ఆస్పత్రులు, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకు లింకేజీ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రహదారుల పనులు, వైఎస్సార్ సీపీ… వైజేపీ, మెప్మా, ఎంపీ ల్యాడ్స్, వ్యవసాయ, ఉద్యాన, మైనర్ ఇరిగేషన్ శాఖలు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యకలాపాలు, పాఠశాలలు, కళాశాలలు, సాంఘిక సంక్షేమ శాఖల పురోగతిపై ప్రధానంగా చర్చించనున్నారు.

10న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

ధర్మవరం: కళ్యాణదుర్గంలో ఈనెల 10న జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ బాయ్స్, సీనియర్ ఉమెన్ జట్లను ఎంపిక చేయనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు వైఎస్సార్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. జూనియర్ బాలురకు సంబంధించి 1-01-2004వ తేదీ అనంతరం జన్మించిన వారు అర్హులన్నారు. సీనియర్ ఉమెన్‌లకు సంబంధించి అందరూ అర్హులేనని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ జిరాక్స్, ఫారం–5 సర్టిఫికెట్ తీసుకుని రావాలన్నారు. పూర్తి వివరాలకు 8978137522, 8074793673 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం

- 'ఆరోగ్య సురక్ష'కు విశేష ఆదరణ
- విజయవంతంగా వైద్య శిబిరాలు
- తరలివస్తున్న వేలాదిమంది జనం
- వైద్య సేవలపై పూర్తిస్థాయిలో సంతృప్తి

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం	సెప్టెంబర్ 30
ఇప్పటి వరకు నిర్వహించిన మెడికల్ క్యాంపులు	164
ఓపీ వైద్య సేవలు పొందిన వారి సంఖ్య	50,950



అనంతపురం వైద్య శిబిరంలో ఓపీ టికెట్ తీసుకుంటున్న మహిళ

అనంతపురం మెడికల్: పేదలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం చేపట్టింది. గత నెల 15 నుంచి ఆరోగ్య సిబ్బంది జిల్లాలో ఇంటింటా సర్వే నిర్వహించి, అందులో దీర్ఘకాలిక, తదితర సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించారు. వీరికి గత నెల 30 నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 'ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాల ద్వారా స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్లతో వైద్య సేవలందిస్తున్నారు.

విజయవంతంగా 164 వైద్య శిబిరాలు..
జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 164 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఆరోగ్య శాఖ విజయవంతంగా నిర్వహించింది. అందులో 50,950 మంది ఓపీ సేవలు పొందారు. స్పెషలిస్టు వైద్యులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 1,025 మందిని మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి, 75 మందిని నెట్‌వర్క్ ఆస్పత్రులకు, ఏడుగురిని జిల్లా ఆస్పత్రికి, 78 మందిని సీహెచ్‌సీలకు రెఫర్ చేశారు. వీరికి ఆయా ఆస్పత్రుల్లో సేవలందించేలా జీజీహెచ్, డీసీహెచ్‌ఎస్, ఆరోగ్యశాఖ సమన్వయంతో ముందుకెళ్తున్నాయి. నవంబర్ 24 వరకు వైద్య శిబిరాలు జరగనున్నాయి.

ప్రజాప్రతినిధుల ప్రత్యేక దృష్టి..
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తదితరులు వైద్య శిబిరాల విజయవంతంలో భాగస్వాములవుతున్నారు. ప్రజలు ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకునేలా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

నేడు ఎనిమిది చోట్ల మెడికల్ క్యాంపులు..
జిల్లాలోని బుక్కరాయసముద్రం, ఓబుళాపురం, కల్లూరు, సొల్లాపురం, పసలూరు, శనగలగూడూరు, యర్రగుంటపల్లి, వెలిగొండ ప్రాంతాల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నారు. ఈ ప్రాంతాల్లో జరిగే వైద్య శిబిరాలకు సిబ్బంది 1,675 టోకన్లు సిద్ధం చేశారు.

ప్రణాళికాబద్ధంగా క్యాంపులు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. కలెక్టర్ గౌతమి ఆదేశాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నాం. ప్రోగ్రాం ఆఫీసర్లు, స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు సమష్టిగా విధులు నిర్వర్తిస్తున్నారు. మున్ముందు మరింత సమర్థవంతంగా క్యాంపులు నిర్వహిస్తాం.
– డాక్టర్ భ్రమరాంబదేవి, డీఎంహెచ్ఓ

సుదూరం 'ఎగిరొచ్చి'.. సాగు మెచ్చి



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి తెలుసుకుంటున్న విదేశీ ప్రతినిధులు

బత్తలపల్లి: వారంతా విదేశీయులు. మనం సాగు చేస్తున్న పంటల గురించి పుస్తకాల్లో చదువుకున్నారు. ఆ విషయాలన్నీ ఎంతగానో ఆకర్షించాయి. రైతులతోనే నేరుగా మాట్లాడి సాగు విధానం గురించి తెలుసుకోవాలనుకున్నారు. ఇంకేముంది విమానాల్లో వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. జిల్లాకు చేరుకున్నారు. మన రైతులు అవలంబిస్తున్న 'ప్రకృతి' సాగు విధానాలను ప్రత్యక్షంగా చూసి మురిసిపోయారు. బహు బాగుందంటూ కితాబిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని బత్తలపల్లి, గంటాపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రైతులు సాగు చేసిన పంటలను ఆదివారం వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు పరిశీలించారు. సెనగల్, మడగాస్కర్, ఉగాండా, ట్యునీషియా, జాంబియా, రువాండా, జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్, వెస్టిండీస్, అర్జెంటీనా దేశాల ప్రతినిధులు ఇక్కడ సాగు చేసిన పంటల వివరాలు, దిగుబడి, రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. గంటాపురంలో రాధమ్మ సాగు చేసిన వేరుశనగ మోడల్, నిరంతర ఆదాయ పంటలు, బీడు భూముల్లో మూకాంబికా సాగు చేస్తున్న పంటల మోడల్, సుకన్య సాగు చేసిన డ్రాట్ ప్రూఫింగ్ మోడల్‌ను పరిశీలించారు. బీజామృతం, ఘన, ద్రవ జీవా మృతం, సీడ్ పెల్లటైజేషన్ తయారీ విధానాలను ప్రకృతి వ్యవసాయ విభాగం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.విజయకుమార్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) లక్ష్మానాయక్ వారికి వివరించారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పిలుపు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, చిత్రంలో ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా, హాజరైన పార్టీ శ్రేణులు

శింగనమల: రాబోయే ఎన్నికల్లో సమష్టిగా పని చేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురంలోని కేటీఆర్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే అధ్యక్షతన 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' అనే అంశంపై శింగనమల నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం జరిగింది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ గతంలో టీడీపీ పాలన, ప్రస్తుతం జగనన్న పాలన చూశామని, రెండింటి మధ్య తేడాను ప్రజలకు వివరించాలని శ్రేణులకు సూచించారు. టీడీపీ పాలనలో స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రింగ్‌రోడ్డు తదితర స్కాముల్లో అడ్డంగా దొరికిపోయి చంద్రబాబు జైలు పాలయ్యారన్నారు. అయితే ఆయన అవినీతి ఎరుగని నాయకుడంటూ ఎల్లో మీడియా ద్వారా టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ పని అయిపోయిందని, ఆ పార్టీ వెంటిలేటర్ మీద ఉందని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో పేదలకు సంక్షేమ పథకాలను కుల, మత, పార్టీలకు అతీతంగా అందించిందన్నారు. టీడీపీ 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించడం వల్లే ప్రజలు గద్దె దింపారన్నారు. కానీ జగనన్న హామీల్లో 99 శాతం అమలు చేశారని, అందుకే 175 శాసనసభ నియోజకవర్గాలనూ గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. జగనన్నను కాంగ్రెస్ ఎన్నికరకాలుగా ఇబ్బంది పెట్టినా ఎదురొడ్డి నిలబడ్డారని, కేసులు పెట్టినా భయపడలేదని, నీతి, నిజాయితీ ఉంది కాబట్టే సీఎం అయ్యారన్నారు. నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని శింగనమల చెరువుతోపాటు 40 చెరువులను లోకలైజేషన్ చేయించామన్నారు.

పేదల పక్షపాతి జగనన్న..
ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో పేదల కష్టాలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కళ్లారా చూసి, అధికారంలోకి వచ్చాక వారి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకున్నారని కొనియాడారు. సుపరిపాలనతో ఆదర్శంగా నిలిచారన్నారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ వారికే సంక్షేమ పథకాలు దక్కేవన్నారు. జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు వర్తిస్తున్నాయన్నారు. జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుంటేనే సంక్షేమ పాలన అందుతుందన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి..
ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల స్థాయి నాయకులు, గృహసారథులు, వలంటీర్లు, కార్యకర్తలకు సూచించారు. 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమాన్ని ప్రతి సచివాలయ పరిధిలో నిర్వహించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ ఎన్నికలు సమీపించినందున పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీతమ్మ, వైస్ చైర్‌పర్సన్ మూడ్ గీత, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరామిరెడ్డి, చెన్నకేశవులు, నార్పల సత్యనారాయణరెడ్డి, రఘునాథరెడ్డి, మిద్దె కుళ్లాయప్ప, రాజశేఖర్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, పార్టీ మండల కన్వీనర్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



విజయవాడకు బయల్దేరి వెళ్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్, పైలా తదితరులు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం విజయవాడలో జరిగే ప్రతినిధుల సదస్సుకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. మంత్రి ఉషశ్రీచరణ్‌తో పాటు విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, వై.వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తరలి వెళ్లారు. ఇంకా మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మునిసిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ, జోనల్ ఇన్‌చార్జ్‌లు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు వెళ్లిన వారిలో ఉన్నారు.

నాడు వెలవెల.. నేడు కళకళ



బుక్కపట్నం దగ్గర దిగుడు బావిలో నీళ్లు పుష్కలంగా ఉన్న దృశ్యం



బావి కింద మామిడి తోట సాగు చేసిన దృశ్యం



బుక్కపట్నం సమీపంలో బావి కింద సాగులో ఉన్న వరి

- దిగుడు బావులకు పూర్వ వైభవం
- 2018కి ముందు కేవలం 50 బావుల్లోనే నీరు
- నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు
- బావుల రీచార్జ్‌కు ప్రభుత్వ సహకారం
- ప్రస్తుతం 300 బావుల్లో జలకళ

పుట్టపర్తి అర్బన్: ఏళ్ల క్రితం పూర్వీకులు తవ్విన దిగుడు బావులు నాలుగేళ్ల క్రితం వరకూ నీళ్లు లేక కళావిహీనంగా ఉండేవి. దిగుడు బావులున్నా వరుస కరువులతో రైతులు వాటి కింద పంటలు కూడా సాగు చేసేవారు కాదు. అయితే 2019 నుంచి వర్షాలు బాగా పడటంతో భూగర్భ జలాలు పెరగడంతో దిగుడు బావులు కూడా పూర్వ వైభవం సంతరించుకున్నాయి.

అప్పుడు 50.. ఇప్పుడు 300..

2018కి ముందు కేవలం జిల్లాలోని 50 బావుల్లో మాత్రమే నీళ్లు ఉండేవి. అయితే 2019 నుంచి 300 బావులలో నీళ్లు పుష్కలంగా ఉండటంతో ప్రతి సంవత్సరం బావుల కింద రెండు పంటలను రైతులు పండించుకుంటున్నారు. దాదాపుగా 2 వేల ఎకరాల్లో దిగుడు బావుల కింద అన్నదాతలు పంటలు సాగు చేస్తున్నారు.

ప్రభుత్వం సహకారం

రైతులు తవ్వుకున్న సంప్రదాయ దిగుడు బావులు రీచార్జ్ అయ్యేందుకు ప్రభుత్వం ఉపాధి పథకం కింద పెద్ద ఎత్తున పనులు చేపట్టింది. బావి పక్కన వర్షపు నీరు వృథా కాకుండా కాంటూర్ బండింగ్ పనులు చేపట్టడంతో బావుల్లో భూగర్భ జలాలు పెరిగేందుకు దోహదం చేశాయి. బుక్కపట్నం, కొత్త చెరువు, పుట్టపర్తి మండలాల పరిధిలో సంప్రదాయ బావులు అధికంగా రీచార్జ్ అయ్యాయి.

ఇబ్బంది లేకుండా పంటల సాగు..

గత నాలుగు సంవత్సరాలు వర్షాలు బాగా కురవటంతో పాటు బుక్కపట్నం చెరువు, మారాల రిజర్వాయర్, కొత్తచెరువు మండలం తలమర్ల, మీర్జాపురం, పుట్టపర్తి మండలం చెర్లోపల్లి, వెంగళమ్మచెరువులు నిండటంతో దిగువ ఉన్న బారు బావుల్లోనూ భూగర్భ జలాలు అధికంగా ఉండటంతో ఏ ఇబ్బంది లేకుండా రైతులు పంటలు సాగు చేస్తున్నారు. భూమి రకాన్ని బట్టి రైతులు వేరుశనగ, మామిడి, వరి, సపోటా తదితర పంటలు సాగు చేశారు. పెద్దలు ఎంతో కష్టపడి బావులు తవ్వించారని, వాటిని అభివృద్ధి పరచి పంటలు సాగు చేసుకుంటున్నామని పలువురు రైతులు పేర్కొన్నారు.

బావుల కిందే పంట సాగు



గతంలో తీవ్ర కరువు వల్ల పెద్దలు తవ్విన దిగుడు బావుల కింద పంటలు సాగు చేసుకోలేకపోయాం. గత నాలుగేళ్లుగా వర్షాలు బాగా కురవటంతో బావులు రీచార్జ్ అయ్యాయి. దీంతో ప్రతి ఏటా పంటలు పండించుకుంటున్నాం. బావి కింద వరి, ఇతర వాణిజ్య పంటలు సాగు చేశాను

– బాబుల్‌రెడ్డి, బ్రాహ్మణపల్లి, పుట్టపర్తి మండలం

చాలా సంతోషంగా ఉంది



మా పొలాల వద్ద గతంలో దిగుడు బావి తవ్వారు. అయితే గడచిన 20 సంవత్సరాలుగా బావి పూర్తిగా ఎండి పోవటంతో మాగాణులు బీళ్లుగా మారాయి. అయితే గత నాలుగేళ్లుగా వర్షాలు బాగా పడటంతో బావి పూర్వ వైభవం సంతరించుకుంది. ఏ ఇబ్బందీ లేకుండా పంటలు పండించుకుంటున్నాం.

– పవన్, రైతు, బుక్కపట్నం

క్లుప్తంగా

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు లంకా మణికాంత్

కదిరి టౌన్: పట్టణంలోని ఎన్‌జీహోమ్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ సీఓ ఎస్‌ఈడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు లంకా మణికాంత్ హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైద్య సిబ్బంది రుణపడి ఉండాలన్నారు. వైద్యఆరోగ్యశాఖలో 2003 నుంచి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీహెచ్, ఎల్‌టీ ఫార్మాసిస్ట్, స్టాఫ్‌నర్సు క్యాడర్‌కు చెందిన వారిని రెగ్యులర్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ లింగాల కరుణాకర్‌రెడ్డి, కోఆర్డినేటర్ దాసరి మురళీధర్, ట్రెజరర్ శీరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ దుర్మరణం



ఘటనాస్థలంలో ప్రవీణ్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు ... అనంతపురం నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ (35), శ్రీనివాసనగర్‌కు చెందిన ఉదయ్‌కిరణ్ స్నేహితులు. ఇద్దరూ పెయింటింగ్ పని చేస్తుండేవారు. ఆదివారం అనంతపురం నుంచి గార్లదిన్నెకు పనిమీద ఇద్దరూ బైకులో బయలుదేరారు. సోములదొడ్డి దాటిన తర్వాత దర్గా సమీపంలోకి వెళ్లగానే అదుపు తప్పి బైక్ డివైడర్లను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బండి నడుపుతున్న ప్రవీణ్‌కుమార్ తల డివైడర్‌కు బలంగా తగలడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ఉదయ్‌కిరణ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా తలకు హెల్మెట్ పెట్టుకుని ఉంటే ఇంత ప్రమాదం జరిగేది కాదని స్థానికులు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



వృద్ధురాలి భౌతికకాయం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని గుత్తి రోడ్డు సమీపంలోని బీవీఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. వృద్ధురాలి వయస్సు 70 సంవత్సరాలు ఉంటుందన్నారు. వృద్ధురాలు తెల్ల చీర, మెరున్ రెడ్ కలర్ జాకెట్ ధరించి ఉందన్నారు. వృద్ధురాలి ఆచూకీ తెలిస్తే సీఐ: 9440796816, ఎస్ఐ: 9392918291 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

గుండెపోటుతో వైకేపీ ఏపీఎం మృతి

- సంతాపం తెలిపిన డీఆర్‌డీఏ పీడీ



శ్రీనివాసమూర్తి (ఫైల్)

ఉరవకొండ: రాయదుర్గం వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం శ్రీనివాసమూర్తి (52) ఆదివారం తెల్లవారుజామున ఉరవకొండలోని తన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద నివాసముంటున్న ఏపీఎం శ్రీనివాసమూర్తి రాయదుర్గం ఏపీఎంగా రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇంట్లో ఉన్న సమయంలో ఒక్కసారిగా ఛాతిలో నొప్పిరావడంతో భార్య మహేశ్వరీ, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఏపీఎం మృతికి డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి సంతాపం తెలిపి అంత్యక్రియల నిమిత్తం రూ.25 వేలు కుటుంబ సభ్యులకు అందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వైకేపీ ఏసీ, ఏపీఎం, సీసీలు శ్రీనివాసమూర్తి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో పరికరాల అపహరణ



మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టిన దృశ్యం

కూడేరు: మండల పరిధిలోని జల్లిపల్లిలో శనివారం రాత్రి రైతుల వ్యవసాయ మోటర్లకు ఏర్పాటు చేసిన మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి అందులోని ఆయిల్, కేబుల్, ఇతర పరికరాలను ఎత్తుకెళ్లినట్లు ట్రాన్స్‌కో ఏఈ గౌస్ తెలిపారు. ఎత్తుకెళ్లిన పరికరాల విలువ సుమారు రూ.60 వేలు వరకూ ఉంటుందన్నారు.

జిల్లా ఖోఖో జట్ల ఎంపిక



ఎంపికైన బాలికల జట్టు



ఎంపికైన బాలుర జట్టు

ఉరవకొండ: స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి ఖోఖో అండర్–18 బాల, బాలికల జట్లను ఆదివారం ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 250 మంది క్రీడాకారులు ఎంపిక ప్రక్రియకు హాజరయ్యారు. ఖోఖో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లారెడ్డి, జిల్లాకు చెందిన సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయుడు మారుతీ ప్రసాద్, రాజేష్, రాంభూపాల్, ప్రభాకర్, మంజునాథ్, జనార్ధన్, రాఘవేంద్ర, సురేష్, మాధవి, శర్మాస్, నాగరాజు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసినట్లు వారు పేర్కొన్నారు. ఎంపికైన బాల,బాలికల జట్లు ఈనెల 19 నుంచి 23 వరకు చిత్తూరు జిల్లా యాదమరిలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఖోఖో అండర్–18 బాలికల జట్టు..

నాగులపురంకు చెందిన సంధ్య, స్వప్న, హారిక, సోనిక, ఐశ్వరయ్య, ధనలక్ష్మి, ఆమిద్యాలకు చెందిన మౌనిక, మోపిడికి చెందిన సునీత, వర్షిణి, సంధ్య, ఉరవకొండకు చెందిన రాజ్యలక్ష్మి, శాంతి, శ్రీవాణి, తాడిపత్రికు చెందిన తేజేశ్విని, అనంతపురంకు చెందిన మమత, గుంతకల్లుకు చెందిన రషీద ఎంపికయ్యారు.

బాలుర జట్టు..

ఉరవకొండకు చెందిన అనిల్‌కుమార్, గౌతమ్, అజయ్‌కుమార్, గణేష్, నాగులపురంకు చెందిన అంజి, మహేంద్ర, అనంతపురంకు చెందిన అభిషేక్, గుంతకల్లు వీరశేఖర్, ఆమిద్యాలకు చెందిన నరేంద్ర, లోకేష్, మోపిడికు చెందిన హరికృష్ణ, వంశీకృష్ణ తాడిపత్రికు చెందిన లోకేష్ ఎంపికయ్యారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

లింగాల: వైఎస్సార్ జిల్లా లింగాల మండలం బోనాలలో కదిరిగాండ్ల గీత (28) అనే వివాహిత శనివారం రాత్రి ఇంట్లో కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ రవికుమార్ వివరాలమేరకు... అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన రమేష్ టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అక్కడే గీత అనే మహిళను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరు తాడిపత్రిలో నివాసముంటున్నారు. అయితే వారి మధ్య కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. దీంతో గీత... రమేష్ అమ్మగారి ఊరైన బోనాల గ్రామానికి వెళ్లింది. రమేష్ అవ్వ, తాతతో విషయం తెలిపింది. అయితే రాత్రి 12 గంటల ప్రాంతంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. గీత మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

లేపాక్షిలో వ్యక్తి...

లేపాక్షి: మండలంలోని కొండూరు సమీపంలోని పొలాల్లో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఆదివారం ఉదయం విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్‌తో పాటు తహసీల్దార్ బాబు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి పంచాయతీ పరిధిలోని కొర్లకుంటకు చెందిన వెంకటేష్ (28) అనే వ్యక్తిగా గుర్తించారు. మృతుడికి భార్య ప్రస్తుతం గర్భిణి అని గ్రామస్తులు తెలిపారు. వెంకటేష్ ఆత్మహత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కోనసీమ ఆధ్యాత్మిక వైభవం



చిత్రావతి నదిలో హంస వాహనంపై సత్యసాయి చిత్రపటంతో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

- ఆకట్టుకున్న పరివర్తన నృత్యరూపకం
- భక్తిశ్రద్ధలతో తెప్పోత్సవం

ప్రశాంతినిలయం: బాలవికాస్ విద్యార్థులు, సత్యసాయి యూత్ నిర్వహించిన 'పరివర్తన' నృత్యరూపకం భక్తులను మైమరపించింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన కోనసీమ సత్యసాయి భక్తులు ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యసాయి దైవ స్వరూపుడా? కాదా? అన్న అంశంపై నిర్వహించిన నృత్యరూపకం అందరినీ అలరించింది. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే.రత్నాకర్‌రాజు దంపతులు కళాకారులకు నూతన వస్త్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో తెప్పోత్సవం..

కోనసీమ సత్యసాయి భక్తులు భక్తిశ్రద్ధలతో సత్యసాయి తెప్పోత్సవం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం చిత్రావతి హారతి ఘాట్ వద్ద ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై సత్యసాయి చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే.రత్నాకర్‌రాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాన్ని ప్రారంభించారు. చిత్రావతిలో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తూ భక్తి గీతాలు ఆలపించారు.



తెప్పోత్సవ ప్రారంభానికి ముందు పూజలు చేస్తున్న రత్నాకర్‌రాజు దంపతులు



తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు హాజరైన భక్తులు

కదిరిలో చోరీ

- రూ.లక్ష నగదు, రెండున్నర తులం బంగారు అపహరణ

కదిరి టౌన్: పట్టణంలోని ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. రూ.లక్ష నగదు, రెండున్నర తులాల బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. వివరాలు... వలీసాబ్ రోడ్డులో ఉన్న ఆసీఫ్ అలీఖాన్ అనే వ్యక్తి సౌదీ వెళ్లాడు. అతని భార్య ఇమ్రాన్, పిల్లలతో కలిసి ధర్మవరంలోని బంధువుల ఇంటికి రెండు రోజుల క్రితం వెళ్లారు. అయితే శనివారం రాత్రి ఇంటి తాళాలు పగలగొట్టిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ.లక్ష నగదు, రెండున్నర తులాల బంగారు దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం తలుపులు తెరుకొని ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే ధర్మవరం వెళ్లిన ఇమ్రాన్‌కు ఫోన్ విషయాన్ని తెలియజేశారు. వెంటనే ఆమె కదిరి పట్టణానికి వచ్చారు. ఇంటిలో ఉన్న రూ.లక్ష నగదు, రెండున్నర తులాల బంగారు బంగారు దోచుకెళ్లారని కన్నీరు మున్నీరయ్యారు. వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ నారాయణరెడ్డి సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, సీసీ ఫుటేజ్ పరిశీలించారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి



మృతుడు రామాంజినేయులు

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని కామక్కపల్లి గేట్ వద్ద జరగిన రోడ్డు ప్రమాదంలో రామాంజినేయులు (60) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. ఒంటిమిద్దికి చెందిన రామాంజినేయులు పని నిమిత్తం కామక్కపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు.అయితే కామక్కపల్లి గేట్ వద్ద అదుపు తప్పి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నరు. మృతుడు బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. గతంలో మృతుడు రామాంజినేయులు రెండో కుమారుడు కూడా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి



మృతుడు సిద్ధణ్ణ

రాయదుర్గంటౌన్: పత్తితోటలో పనిచేస్తూ విద్యుదాఘాతంతో సిద్ధణ్ణ (55) అనే వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన రాయదుర్గం పట్టణంలోని ముత్తరాసి కాలనీలో జరిగింది. వివరాలు... ఆదివారం కూలి పనినిమిత్తం సిద్ధణ్ణ పట్టణంలోని ముత్తరాసి కాలనీలోని ఓ పత్తి తోటకు వెళ్లాడు. తోట చివరి భాగంలో మరో ముగ్గురు కూలీలతో కలిసి మడకతోలుతూ జంతులు కడుతున్న క్రమంలో చాలా కిందకు వేలాడుతున్న ప్రధాన విద్యుత్ తీగలకు ఎద్దు కొమ్ములు తగిలి రాపిడి కారణంగా కింద పడ్డాయి. ఈ క్రమంలో అక్కడే ఉన్న సిద్ధణ్ణకు విద్యుత్ తీగలు చుట్టుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తోటి కూలీలు తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ లక్ష్మణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

సీఆర్పీఎఫ్ జవాన్ల ఆత్మీయ కలయిక



కళ్యాణదుర్గం రూరల్: స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో 1993 బ్యాచ్‌కు చెందిన పోలీస్ దళం (సీఆర్పీఎఫ్) జవాన్లు ఆదివారం ఆత్మీయ కలయికను ఘనంగా జరుపుకున్నారు. మాజీ సీఆర్పీఎఫ్ జవాన్ పాతిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రలకు చెందిన దాదాపుగా 62 మంది సైనికులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో తమ ప్రాణాలు కోల్పోయిన జవాన్లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వన్నూరప్ప శ్యాంసుందర్, అశోక్, వీరమల్లు వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Sc. (నర్సింగ్) అడ్మిషన్స్

■ B.Sc (Nursing) లో చేరడానికి Web Options (కాలేజీల ఎంపిక) మొదలైంది. AP EAPCET లో ర్యాంకు వచ్చిన స్టూడెంట్స్‌కి అవకాశం. సంప్ర : జి. మురళీ, సెల్ : 9030661651, ATP. [A-2739]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT & Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1948]

ADMISSIONS

■ GNM (నర్సింగ్) అడ్మిషన్స్ లాస్ట్ డేట్ Oct 27 ఇంటర్ పాస్ స్టూడెంట్స్‌కి గర్ల్స్ కాలేజీలో Govt సీట్స్ GNM (నర్సింగ్) నందు ఫ్రీ ఎడ్యుకేషన్స్ హాస్టల్ కలదు. G.Murali ✆ 9030661651 [G-1144]

REAL ESTATE

TOLET

■ డబుల్ బెడ్ రూం, కిచెన్, హాల్, మంచినీటి సౌకర్యం కలదు. KLD రోడ్డు, డా॥ రజాక్ క్లినిక్ ప్రక్కన, నివాసమునకు / ఆఫీస్‌లకు గానీ ఇవ్వబడును బాడుగ : రూ. 9 వేలు మాత్రమే. 9951626131. [A-776903]

షాప్స్ అమ్మబడును

■ ATP, KLD రోడ్‌లో ఉన్న పాండ ఫ్యామిలీ రెస్టారెంట్ మరియు వందన శారీస్ & కిడ్స్‌వేర్ షాప్ అమ్మబడును. సెల్ : 9030309695, 9866012861. [A-1237]

SERVICES

CHANGE OF NAME

■ I, Achyutha Nirmala wife of Achyutha Suresh, R/o. 1-235, 2nd Road, New town, Ananthapur, A.P. Has changed my name from Bavanaari Nirmalaamma to Achyutha Nirmala. Hence of i will be called as Achyutha Nirmala for all purpose and transaction. [HA-11791]

WANTED

■ అనంతపురం జిల్లా గార్లదిన్నెలో ఉన్న ఎడ్యుకేషనల్ సర్వీస్ Officeలో టెలికాలర్స్‌గా Work చేయడానికి Females కావలెను సంప్ర॥ సెల్ : 8977502169. [A-2738]

■ అనంతపురం సిటి నందు గల సాయిరాం ఎలక్ట్రానిక్స్ షోరూమ్ నందు పనిచేయుటకు Boys కావలెను. సంప్ర : సెల్: 9966007886. [A-310]

■ అనంతపురం టౌన్‌లోని ప్రముఖ బట్టల షాపు మరియు చెప్పుల షాపు నందు పనిచేయుటకు, సేల్స్‌గర్ల్స్ మరియు సేల్స్ బాయ్స్ కావలెను. Cont:9959247543. [A-314]

■ SBI LIFE INSURANCE నందు Part / Full Time Advisors నియామకాలు జరుగుచున్నవి. నెలకు 25000 వరకు సంపాదించుకొనే అవకాశం కలదు.అర్హత:10th Pass, 18 సం॥ నిండినవారు ఆసక్తికలవారు సంప్ర: సెల్: 9182944582. [A-7334]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం:18K. Ph:9640468899/ 9640258899 [HA-189338]

■ ప్రముఖుల ఇళ్ల వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. జీతం: 14-20K, వసతి + భోజనం, VJA. ✆ 91608 35559, 78158 35561 [B-447]

■ ఫార్మ్ ల్యాండ్స్ రియల్ ఎస్టేట్ కంపెనీలో వర్క్ చేయుటకు మార్కెటింగ్ డైరెక్టర్స్, టీమ్ లీడర్స్ కావలెను. జీతం & కమీషన్. 7730899503 [G-1147]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 72077 76136. [M-1221760]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221741]

■ Jobs : చదవడానికి గాని / ఏదైనా ప్రైవేట్ జాబ్స్ చేయడానికి గాని, స్టూడెంట్స్‌ని Refer చేయాలి. మంచి కమీషన్ ఇవ్వబడును. సంప్ర : 9030661651, అనంతపురము. [A-2737]

■ ATP, రుద్రంపేట సాక్షి ఆఫీసు దగ్గర్లో పని చేయుటకు సెక్యూరిటీ కావలెను. Q: 10th పాస్, జీతం:9,500+EPF, ESIC, 12 గం॥ డ్యూటీ Age:30- 40. సంప్ర : సెల్ : 9848524061. [A-776913]

■ SSC / ఇంటర్ (పాస్/ఫెయిల్) అయి ఖాళీగా వున్న 28 మంది స్త్రీ/పురుషులకు మా కంపెనీలో ఉద్యోగాలు. జీతం : 14000+బోనస్ 6000 +ఫ్రీరూం. సంప్ర : సాయినగర్, 1వ క్రాస్, అనంతపురము. సెల్: 9701864175. [A-7333]

■ Wanted:(1)cold storage plant Operators (ITI- Electrical, Exp- 2 Years) (2) Fruits & Vegetables - Procurement Supervisor @ Fresh cart Agro (p) Ltd, Kld road, Atp. (interview: 12/10/2023) Cell : 8143697965. [A-1236]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

సర్పరూపుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. స్వామి మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, పూజలు చేశారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కాలసర్ప నివారణ దోషపూజలు, రాహుకేతు హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా పాస్టర్ల దినోత్సవం



పాస్టర్ మనుష్యేను అభినందిస్తున్న చర్చి సభ్యులు

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు చర్చిల్లో ప్రపంచ పాస్టర్ల దినోత్సవం నిర్వహించారు. ఆదివారం కళాకారుల కాలనీలోని రేమా చర్చిలో పాస్టర్ల దినోత్సవం సందడిగా సాగింది. చర్చి పాస్టర్ రెవరెండ్ మనుష్యే ప్రత్యేక దినం ప్రాముఖ్యతను వివరించారు. అంతకు ముందు ప్రార్థనామందిరంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

భక్తిమార్గంతోనే ఉన్నత జీవితం

- త్రిదండి సంపత్‌కుమార జీయర్ స్వామీజీ



అనుగ్రహ భాషణం చేస్తున్న సంపత్‌కుమార జీయర్ స్వామీజీ

అనంతపురం కల్చరల్: భక్తిమార్గంతోనే ఉత్తమ గతులు, ఉన్నత జీవితం ప్రాప్తిస్తాయని త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామీజీ ఉద్బోధించారు. స్వామీజీ దేశవ్యాప్తంగా హైందవ మత ప్రచార యజ్ఞంలో పాల్గొంటూ ఆదివారం అనంతకు చేరుకున్నారు. స్వామీజీ స్థానిక ఆర్ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రవచనం చేశారు. అంతకు ముందు స్వామీజీ ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు మణూరు నాగరాజు, రమేష్ తదితరుల గృహాలకు వెళ్లి పాదపూజలందుకున్నారు.

శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు



జేసీబీతో రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని బి.యాలేరు నుంచి తగరకుంట వరకు రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డు పనుల్లో భాగంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ వేగవంతంగా పనులు చేస్తున్నారు.

విజయవాడకు వెళ్లిన కార్పొరేటర్లు



విజయవాడకు వెళ్లే బస్సును ప్రారంభిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన సోమవారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే ప్రతినిధుల సదస్సుకు కార్పొరేటర్లు బయల్దేరారు. కార్పొరేటర్లు వెళ్లడానికి మేయర్ వసీం ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేశారు. ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బస్సును మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య జెండా ఊపి ప్రారంభించారు. మేయర్ వసీం బస్సులో బయల్దేరి వెళ్లారు.

ఫైనల్‌కు ఢిల్లీ, బిహార్ జట్లు



ఢిల్లీ, మధ్యప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్ దృశ్యం



విజయానందంలో క్రీడాకారులు

అనంతపురం: ఆర్డీటీ క్రీడా గ్రామంలో 12 రోజులుగా జరుగుతున్న నేషనల్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఢిల్లీ, బిహార్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం ఉత్కంఠంగా సాగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో బిహార్ - అస్సాం తలపడగా, బిహార్ జట్టు రెండు గోల్స్, అస్సాం ఒక గోల్ సాధించింది. దీంతో బిహార్ ఫైనల్‌కు చేరుకుంది. సాయంత్రం ఢిల్లీ, మధ్యప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 5 గోల్స్, మధ్యప్రదేశ్ 4: గోల్స్ చేయగా, ఢిల్లీ గెలుపొందింది. ఢిల్లీ, మధ్యప్రదేశ్‌ల మధ్య మ్యాచ్ ఉత్కంఠంగా కొనసాగింది. ఫైనల్ మ్యాచ్ ఆర్డీటీ క్రీడా గ్రామంలోనే నిర్వహించనున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేపట్టారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 39వ డివిజన్‌లో లక్ష్మీనగర్ నుంచి నడిమి వంకకు వెళ్లే జన్మభూమి రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనులు జరిగే సమయంలో ఇంజినీర్లు తప్పక అందుబాటులో ఉండాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. అనంతపురం చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత రోడ్లు, కాలువ నిర్మాణ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటికే నగరంలోని ప్రధాన రహదారుల విస్తరణ పనులు చివరి దశకు చేరాయన్నారు. రానున్న రెండు, మూడు నెలల్లో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. రుద్రంపేట ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను కూడా పూర్తి చేస్తామన్నారు. లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, నాయకులు అనిల్‌కుమార్‌గౌడ్, రఫీ, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

గుంతకల్లుటౌన్: సురక్షిత ప్రయాణానికి చిరునామాగా నిలిచిన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆకర్షణీయమైన బహుమతులు పొందాలని గుంతకల్లు డీఎం నారాయణస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు–ఆదోని రూట్లల్లో తిరిగే 9 సర్వీసుల్లో ఈ నెలాఖరు వరకు ప్రయాణించిన వారు తమ టిక్కెట్ వెనకాల పేరు, ఫోన్ నంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసి గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని పేర్కొన్నారు. 15 రోజులకోసారి లక్కీ డ్రా తీసి మొదటి ముగ్గురు విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులను అందజేయనున్నట్లు తెలియజేశారు.

20న వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



పోస్టర్లను విడుదల చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

పుట్లూరు: ఈ నెల 20న తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డు సర్కిల్ వద్ద వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వాల్మీకి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు వెంకటేష్, ఆదినారాయణ, శ్రీరాములు, దొడ్లో హనుమంతు, బ్రహ్మయ్య, నారాయణస్వామి, ఓబుళేసు, శివ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పైపుల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

యాడికి: డ్రిప్ పైపుల చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఎస్‌ఐ వివరాలు వెల్లడించారు. రాయలచెరువు గ్రామంలో సరస్వతీ పైపుల షాపు బయట ఉన్న 1.5 టన్నుల డ్రిప్ పైపులు శనివారం చోరీకి గురయ్యాయి. షాపు యజమాని భాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం రాయల చెరువు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కుమారుడు హరికృష్ణ డ్రిప్ పైపులను గుత్తికి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు హరికృష్ణపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కార్తీక ఉత్సవాల నిర్వహణకు కొటేషన్ల ఆహ్వానం

గుంతకల్లు రూరల్: ప్రసిద్ధ శైవ క్షేత్రం బుగ్గ సంగమేశ్వర ఆలయంలో నవంబర్ 14 నుంచి కార్తీక ఉత్సవాల నిర్వహణలో భాగంగా వివిధ రకాల పనులకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ కృష్ణయ్య ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నెల రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో క్యూలైన్ల ఏర్పాటు, షామియానాల, ప్రింటింగ్ మెటీరియల్ సప్లయ్, సున్నం పూతలు, నిత్యాన్నదానం కోసం కిరాణా సరుకులు, కూరగాయల సరఫరా, వంట మాస్టర్, సప్లయర్స్, భోజనశాలలో ఇనుప జాలరీ, ఆలయ అద్దె గదుల ముందు మెట్ల ఏర్పాటు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 16వ తేదీలోపు ఆలయ ఈఓ కార్యాలయంలో కొటేషన్లు అందజేయాలని ఈఓ సూచించారు.

వ్యక్తి అదృశ్యం



పుల్లారెడ్డి (ఫైల్)

బుక్కరాయసముద్రం: మండలంలోని రేగడి కొత్తూరు గ్రామంలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వడ్డిరెడ్డి పుల్లారెడ్డి(46) గత నెల 16న బాట్లో సుంకులమ్మ నాలయానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంత వరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం బాధితుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పుల్లారెడ్డి ఆచూకీ తెలిస్తే సీఐ - 9440796816, ఎస్ఐ–9392918291 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

అప్రమత్తంగా ఉండండి

గార్లదిన్నె: మండల ప్రజలు చైన్ స్నాచర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ అస్రార్ బాషా సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో చైన్ స్నాచింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ నిత్యం ప్రజలు దొంగతనాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హరీష్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు



హరీష్ కుమార్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెల్పుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఆయన నివాసంలో జరిగిన వేడుకల్లో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లు మీసాల రంగన్న, నదీం అహ్మద్, జింకా విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాగార్జున యాదవ్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు. పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు హరీష్‌కుమార్ యాదవ్ ఇంటి ముందు యువత పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బాణా సంచా పేల్చి ఆనందం పంచుకున్నారు. అనంతరం హరీష్‌కుమార్ యాదవ్ కేక్ కట్ చేసి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు అందించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, పార్టీ నేతలు హర్షా కేతిరెడ్డి, రిలాక్స్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్‌లో ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ప్రజారోగ్యం – ప్రభుత్వ బాధ్యత అనే అంశంపై ఉమ్మడి ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ గేయానంద్, డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజనాస్పత్రి, ఏరియా ఆస్పత్రుల్లో, సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రజారోగ్య వేదిక నాయకులు డాక్టర్ ప్రసూన, డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్ శ్రీనివాస రావు, డాక్టర్ శంకర్, సామాజికవేత్త నబీరసూల్, రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు నిఖిల్‌నాయక్

గార్లదిన్నె: మండలంలోని ఓబులాపురం కొట్టాల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. శింగనమల మండలం నాగుల గుడ్డం తండాకు చెందిన నిఖిల్ నాయక్(22) బైక్‌పై గార్లదిన్నె నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. ఓబులాపురం కొట్టాల సమీపంలోని రంగు ఫ్యాక్టరీ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవ ఆరాధన

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం దివ్యాంగుల దినోత్సవ ఆరాధనను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీవీ మోహన్ మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల దేవుడు కలిగిన దయ, కరుణ అందరం కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో దివ్యాంగులు సకలాంగులకు ఏమాత్రం తీసిపోవడం లేదన్నారు. దివ్యాంగులను ఆదరించి దేవుని కృపను పొందాలన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు వీరయ్య పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: లచ్చానుపల్లిలో ఓ వ్యక్తి ఆదివారం ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు కొన్ని నెలలుగా ఆర్థిక సమస్యలతో పాటుగా కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కిందకు దింపి గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

14న 'విమర్శా పునర్నవం' ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత రాచపాళెం చంద్రశేఖరరెడ్డి రచించిన 'విమర్శా పునర్నవం' ప్రత్యేక సాహిత్య సంచికను ఈనెల 14న ఆవిష్కరిస్తున్నట్టు నిర్వాహకులు లావణ్య, శ్రీవిద్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9:30 గంటలకు 'మన నవలలు, మన కథానికలు' పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయ అభ్యుదయ రచయితలు, సామాజిక విమర్శకులు, విశ్లేషకులు హాజరవుతారన్నారు.

స్త్రీ విముక్తి సంఘటన జిల్లా మహాసభలు

అనంతపురం అర్బన్: స్త్రీ విముక్తి సంఘటన జిల్లా మహాసభలు ఈనెల 10న నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు సి.మల్లీశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని రజకనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు మహాసభలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమానికి సంఘటన వక్తలుగా సంఘటన రాష్ట్ర అధ్యక్షురాలు విజయ, ప్రధాన కార్యదర్శి లక్ష్మి, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సి.పెద్దన్న, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ఎం బాషా, చంద్రశేఖర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ వాయిదా వేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: సెలవు దినాల్లో ఉపాధ్యాయ శిక్షణను వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు కోరారు. ఆయనతో పాటు ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎస్. రఘురామిరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు డి. ప్రభాకర్, అధ్యక్షులు రాయల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, గౌరవ సలహాదారు బి.వెంకటేశులు, అసోసియేట్ ప్రధాన కార్యదర్శి బి. హనుమప్ప ప్రకటన విడుదల చేశారు. వెంటనే విద్యాశాఖ అధికారులు గుర్తించి ఈనెల 16 నుంచి నిర్వహించనున్న రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

ట్రెనింగ్ వాయిదా వేయాలి..

పాఠశాల విద్య శాఖ ఉపాధ్యాయులకు మూడు విడతల్లో ఇస్తున్న శిక్షణలో భాగంగా రెండో విడతగా దసరా సెలవుల్లో నిర్వహించే శిక్షణను వాయిదా వేయాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గుజ్జల శివయ్య, ప్రధాన కార్యదర్శి డెగావత్ రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు వారు ఓ ప్రకటన విడుదల చేశారు.

In the Court of the Prl. Senior Civil Judge, Anantapuramu.

E.P. No: 40/2019 in O.S No. : 307/2008

Between :

M/s. Margadarsi Chit Fund pvt Ltd, Anantapuramu. Rep. by its Manager Cum Foreman ... D.Hr

and

K.Pandu and Others .... J.Drs

J.Dr 1 కి Order 21 Rule -54,64 and 66 CPC Notice

J.Dr.1 :K.Pandu S/o.K. Chennappa, R/of.D.No:11-1-909, Krupananda Nagar, Anantapuramu.

డిక్రీ హోల్డరుకు రావలసిన E.P. మొత్తము వసూలు చేయుటకు గాను E.P. లోని షెడ్యూలు ఆస్తిని జప్తు చేసియున్నారు. సదరు E.P. వేలము షరతులు నిర్ణయించుటకు మీ హాజరు నిమిత్తం 19-10-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. అందుకు మీకు ఆక్షేపణలున్న యెడల సదరి దినము ఉదయం 10-30 గంటలకు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టు యందు హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షము నందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

బోయపాటి రాజశేఖర్, D.Hr అడ్వకేటు, అనంతపురము. సెల్. 9440289779.

In the Court of the Prl. Senior Civil Judge, Anantapuramu.

E.P. No: 75/2020 in O.S No. : 208/2007

Between :

M/s. Margadarsi Chit Fund pvt Ltd., Kadapa, Rep. by its Manager Cum Foreman ... D.Hr

and

N.Aravind and Others .... J.Drs

J.Dr 3 and 4 కి Order 21 Rule -22 CPC Notice

J.Dr.3 :D.Venkata Ramana S/o D.Krishnamurthy, R/of D.No: 17-1-11, Upstair, Venugopal Nagar, Anantapuramu.

J.Dr.4 :N.Ghouse Mohiddin S/o N.Mahaboob Sab R/of D.No: 24-211, Neeruganti Street Anantapuramu.

పిటీషనరు బాకీ మొత్తం రాబట్టు కొనుటకు గాను మీ పై దాఖలు చేసిన E.Pలో 3,4 వ J.Drs అయిన మీరు 17-10-2023 వతేదీన హాజరగుటకుగాను వాయిదా వున్నది. పై దినం ఉదయం10-30 గంులకు పై కోర్టు వారి ఎదుట ఖుద్దున మీరుగానీ మీ తరుపున వకీలు గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను, లేని చో మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

బోయపాటి రాజశేఖర్, D.Hr అడ్వకేటు, అనంతపురము. సెల్. 9440289779.

ఆముదం సాగుపై రైతుల ఆసక్తి

- మండలంలో పెరిగిన సాగు విస్తీర్ణం



సనప వద్ద సాగు చేసిన ఆముదం పంట

ఆత్మకూరు: మండలంలో ఎన్నడూ లేని విధంగా ఆముదం సాగు విస్తీర్ణం పెరిగింది. గతంలో మండల వ్యాప్తంగా వేరుశనగ అధికంగా సాగయ్యేది. వేరుశనగ పంట దిగుబడి ఆశాజనకంగా లేకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు తగ్గించారు. రబీ సీజన్‌లో బోరు బావుల కింద అధికంగా సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 20 వేల ఎకరాల్లో వేరుశనగ, కంది, ఆముదం, రాగులు, ఉలవ పంటలు సాగు చేశారు. 5,200 ఎకరాల్లో ఆముదం పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలియజేశారు. ప్రస్తుతం వేరుశనగ ధర క్వింటా రూ.8 వేల వరకు పలుకుతోంది. వర్షాలు రాక, పంట దిగుబడి లేక నష్టపోయినట్లు రైతులు చెప్తున్నారు.

పెట్టుబడి తక్కువ..రాబడి ఎక్కువ:

ఆముదం పంట సాగుకు పెట్టుబడి తక్కువ అవుతుంది. ఎకరం సాగుకు రెండు కిలోల ఆముదం విత్తనాలు సరిపడతాయని అధికారులు తెలిపారు. పెట్టుబడి తక్కువ అని, మందులు, కూలీల ఖర్చు కూడా ఎక్కువగా ఉండదని చెప్తున్నారు. ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా ఆముదం ధర రూ.5 వేలకు పైగా పలుకుతోందని రైతులు తెలిపారు.

ఎనిమిదేళ్లుగా సాగు చేస్తున్నా..



గతంలో వేరుశనగ సాగు చేసేవాడిని. అంతర పంటగా ఆముదం సాగు చేసేవాడిని. రాను రాను ఆముదం పంటకు డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది 26 ఎకరాల్లో ఆముదం పంట సాగు చేశా. రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తప్పకుండా పాటిస్తా. వారి సూచనల మేరకే పంటకు మందులు పిచికారీ చేస్తాం.

– రైతు మల్లారెడ్డి, సనప

15 నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు



కొత్తూరు అమ్మవారిశాలలో దసరా వేడుకల బుక్‌లెట్లు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: రాష్ట్రంలోనే ప్రొద్దుటూరు తర్వాత అత్యంత వైభవంగా జరిగే కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలు ఈసారి మరింత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపా మచ్చానరసింహులు తెలిపారు. ఆదివారం కొత్తూరు వాసవీ అమ్మవారిశాలలో జరిగిన సమావేశంలో ఈనెల 15 నుంచి 24 వరకు సాగే దసరా వేడుకల బుక్‌లెట్లు ఆవిష్కరించారు. కమిటీ ప్రతినిధులు పరుచూరు సూర్యప్రకాష్, మిట్టా అంజనేయులు, టంగటూరు నాగభూషణం, తల్లం మురళీ, క్రిష్ణం రఘు, సత్రసాల కిషోర్, శోభ, సుజన్‌కుమార్, సుబ్రమణ్యం, ఆరెస్సెస్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు సి. లింగమయ్య అధ్యక్షతన జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి వి. గోవిందరాజులు, గౌరవ అధ్యక్షుడు ఎస్‌వీవీ రమణయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో సహాధ్యక్షులు రామప్ప చౌదరి, సరళ, కోశాధికారి రాఘవేంద్ర, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ దేవేంద్రమ్మ, జిల్లా కార్యదర్శులు సంజీవ్ కుమార్, అబ్దుల్ వహాబ్ ఖాన్, రాముడు, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం సెంట్రల్: నగరంలో ఖాళీగా ఉన్న నాలుగు అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ లలిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖాజానగర్ (అంగన్‌వాడీ కార్యకర్త, ఓసీ), వెంకట్రామ్‌నగర్ (హెల్పర్, బీసీ–బీ), రంగస్వామినగర్–2 (హెల్పర్, ఓసీ), రహమత్‌నగర్–1 (హెల్పర్, ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులు ఈనెల 11లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సీడీపీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనంతపురము డివిజన్

9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727